మనమూ చేయొచ్చు.. చంద్రయాన్!



చంద్రయాన్-3 విజయవంతమైన వేళ.. దేశం మొత్తం గర్వంతో తలెత్తుకున్న వేళ.. వేలాది మంది విద్యార్థుల్లో తామూ అంతరిక్ష పరిశోధనల్లో రాణించాలనే స్ఫూర్తి రగిలింది. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశమూ సాధించని అరుదైన ఘనత తమ దేశానికి తెచ్చిపెట్టిన శాస్త్రవేత్తల మాదిరిగానే ఖగోళ ప్రయోగాల్లో దూసుకుపోవాలనే కల వేళ్లూనుకుంది. మరి ఇంతటి విశిష్ట ఆశయ సాధనకు ఏ దిశగా అడుగులు వేయాలో.. ఎలా సన్నద్ధం కావాలో చూద్దామా..

ఇంటర్ తర్వాత ఖగోళ పరిశోధనలవైపు అడుగులు వేయాలంటే.. ఈ కింది కోర్సుల్లో ఏదైనా ఎంచుకోవచ్చు.

- ఏరోస్పేస్ ఇంజినీరింగ్
- ఏవియానిక్స్ ఇంజినీరింగ్
- ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్.
- ఆప్టికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్
- ఫిజిక్స్, ఆస్ట్రానమీలో పీహెచ్‌డీ
- ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ
- ఫిజిక్స్ - సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, ఆస్ట్రానమీ, ఎర్త్ సిస్టం సైన్సెస్‌లో ఎంఎస్.

ఖగోళ శాస్త్రవేత్తలు ప్రధానంగా రెండు రకాలు... ఒకరు ఫిజిసిస్ట్, మరొకరు ఆస్ట్రానమర్. ఫిజిసిస్ట్‌లు థియరీ అంశాలు, ల్యాబ్ పరికరాల గురించి అధ్యయనం చేస్తారు. తాము తయారుచేసిన పరికరాలు అంతరిక్షంలో ఎలా పనిచేయగలవో పరిశోధిస్తారు. ఆస్ట్రానమర్‌లు విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు వంటి వాటిని పరిశీలిస్తారు. అక్కడ వాతావరణం, పరిస్థితులు, ప్రయోగాలకున్న అవకాశాలు.. వంటివన్నీ తెలుసుకుంటారు. ఇవేకాక మరిన్ని విభాగాలు కూడా ఉంటాయి.. అన్ని విధాలైన ఇంజినీరింగ్ శాఖలకు వీటితో సంబంధం, పని ఉంటుంది. వీటన్నింటి అంతిమ ధ్యేయం అంతరిక్ష పరిశోధనే!

విద్యాసంస్థలు

- జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, బిట్‌శాట్.. వంటి ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపడం ద్వారా దేశంలోనే అత్యుత్తమ ఇంజినీరింగ్ - టెక్నాలజీ కళాశాలల్లో సీటు దక్కించుకోవచ్చు.
- ఐఐఎస్‌సీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్) - బెంగళూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ) - త్రివేంద్రం, ఐఐటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ది ఇంటర్ - యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ - పుణె, సెంటర్ ఫర్ ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), రామన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - బెంగళూరు... వంటి సంస్థల్లో విద్య అభ్యసించినవారు పరిశోధన దిశగా స్థిరమైన అడుగులు వేయొచ్చు.

ఎలా?

- ఇంటర్మీడియట్ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను మంచి మార్కులతో పూర్తి చేయాలి. చిన్న తరగతుల నుంచే మ్యాథ్స్, సైన్స్‌ల్లో గట్టి పట్టు అవసరం. ఇంటర్ తర్వాత గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత విభాగాల్లో ఇంజినీరింగ్ పూర్తి చేయాలి.
- విద్యార్థులు జియోఫిజిక్స్, జియోఇన్ఫర్మేటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, అప్లైడ్ మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్టుల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ చేయడం ద్వారా పరిశోధనారంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకునే వీలుంటుంది.
- కేవలం ఇస్రోలోనే కాకుండా.. ఇండియాలో ఉన్న ఇతర స్పేస్ టెక్నాలజీ సంస్థల్లోకి కూడా వెళ్లే అవకాశం ఉంది. రాకెట్ల తయారీ, స్పేస్ క్రాఫ్ట్స్, లాంచర్స్, శాటిలైట్స్.. సపోర్టింగ్ సిస్టమ్స్ - టూల్స్ తయారీ.. ఇటువంటి వాటి కోసం పనిచేసే సంస్థల్లో చేరే వీలుంటుంది. ఇవి మాత్రమే కాక విదేశాల్లోనూ వీరికి మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి.

ఇస్రోకి నేరుగా..

ఇస్రో (ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్)కు నేరుగా శాస్త్రవేత్తలను ఎంపిక చేసేలా తన సొంత సంస్థ ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఐసీఆర్‌బీ) పనిచేస్తుంది. గ్రాడ్యుయేషన్ అర్హతతో దీనికి దరఖాస్తు చేయవచ్చు. ఇది కొన్నిసార్లు ప్రాంగణ ఎంపికలు కూడా చేస్తుంది. ఈ సంస్థ నిర్వహించే పరీక్షలు రాయడానికి ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, వేరే ఏదైనా సంబంధిత సబ్జెక్టుతో బీటెక్ లేదా బీఈ చదివుండాలి. ప్రాథమిక పరీక్ష ఉత్తీర్ణులకు తదుపరి దశల్లో రాత పరీక్షలు, ముఖాముఖీలకు ఆహ్వానిస్తారు.

- ఇక్కడే కాకుండా ఐఐటీలు, ఎన్ఐటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు ఇస్రో నియామక పరీక్షలు నిర్వహిస్తుంది. ఖాళీలను అనుసరించి ఎంపికలుంటాయి.
- ఎంపికైన విద్యార్థులు ఏవియానిక్స్ టెక్నీషియన్, ఆస్ట్రానమర్, ఏరోస్పేస్ ఇంజినీర్, ఎలక్ట్రికల్ ఇంజినీర్, మెకానికల్ ఇంజినీర్, స్పేస్ సైంటిస్ట్.. వంటి పలు పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తారు.

ఖగోళ పరిశోధనలకు సహకరించే మరిన్ని సంస్థలు...

- ఏంట్రిక్స్ కార్పొరేషన్
- న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్

ఈ రెండు సంస్థలు శాటిలైట్ సిస్టమ్స్, లాంచ్ వెహికల్స్, టెక్నాలజీను అభివృద్ధి చేస్తాయి.

- ఇవేకాక.. గోద్రేజ్ ఏరోస్పేస్, లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ), అగ్నికుల్ కాస్మోస్, ధ్రువ స్పేస్.. వంటి పలు సంస్థల్లోనూ పనిచేయవచ్చు.

పరిశోధనే ప్రాణమైతే..

ఇస్రో వంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలో భాగం కావాలని ప్రతి విద్యార్థీ కోరుకోవాలి. ఇది పెద్ద పెద్ద నగరాల్లో చదివిన వారికే అనుకుంటే పొరపాటు. సాధారణ పట్టణాల నుంచి వచ్చినవారు కూడా సాధించగలరు. మాది అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గవరవరం గ్రామం. ఆరో తరగతి వరకూ అక్కడే చదివి, తర్వాత నాన్న ఉద్యోగ రీత్యా అనంతపురం వెళ్లాను. పదోతరగతి వరకూ అక్కడే ఉన్నాను. ఇంటర్ విజయవాడలో చదివాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంక్ రావడంతో ఐఐఎస్‌టీ - త్రివేంద్రంలో సీటు దొరికింది. మన దేశంలో అంతరిక్ష విద్యకు అత్యున్నత సంస్థల్లో ఇది ముఖ్యమైంది. క్యాంపస్ వాతావరణం చాలా బాగుంటుంది. అలాగే సీఆర్పీఎఫ్ రక్షణా ఉంటుంది. విద్యార్థుల శ్రద్ధ అంతా డిగ్రీ, పరిశోధనపైనే ఉండేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఇక్కడే ఏవియానిక్స్‌లో బీటెక్ పూర్తిచేశాను. అకడమిక్‌లో మెరుగైన ప్రతిభ కనబరచడంతో పరీక్షల అనంతరం ఇస్రోకి ఎంపికయ్యాను. త్వరలో పీజీ చేయాలి అనుకుంటున్నాను. ఖగోళశాస్త్రంపై ఆసక్తి ఉన్న విద్యార్థులు భౌతికశాస్త్రంతోపాటు లెక్కలు బాగా అధ్యయనం చేయాలి. ఈ సబ్జెక్టుల్లో రాణించినవారు.. స్పేస్ సైన్స్ కోర్సులు పూర్తిచేసుకుంటే.. మన దేశాన్ని అంతరిక్ష పరిశోధనల్లో అగ్రస్థానంలో నిలబెట్టగలం. విద్యార్థులకు అంతరిక్షంపై అవగాహన కల్పించడం కోసం ఏటా అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకూ 'వరల్డ్ స్పేస్ అవేర్‌నెస్ వీక్' నిర్వహిస్తున్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఈసారి మరింత ఉత్సాహంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నారు.

– కొమ్మనమంచి భరద్వాజ్, యువ శాస్త్రవేత్త, ఇస్రో, శ్రీహరికోట.

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

ఎస్‌బీఐలో 6160 అప్రెంటిస్‌లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 6160 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఏపీలో 390, తెలంగాణలో 125 పోస్టులు ఉన్నాయి. పరీక్షలో చూపిన ప్రతిభతో అవకాశం కల్పిస్తారు. ఇందులో విజయవంతమైనవారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. ఈ వ్యవధిలో ప్రతి నెలా రూ.15,000 స్టైపెండ్ చెల్లిస్తారు.

అర్హత: డిగ్రీ, వయసు ఆగస్టు 1, 2023 నాటికి 20-28 ఏళ్లలోపు ఉండాలి.

పరీక్ష: అక్టోబరు/నవంబరులో నిర్వహిస్తారు. తెలుగులోనూ రాసుకోవచ్చు. ప్రశ్నపత్రం వంద మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: https://ibpsonline.ibps.in/sbiaaug23/

42 పారా మెడికల్ పోస్టులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది.

ఖాళీల వివరాలు:

1. ఫార్మసిస్ట్ గ్రేడ్-2: 10 పోస్టులు
2. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2: 1 పోస్టు
3. కౌన్సెలర్/ ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్-2: 1 పోస్టు
4. థియేటర్ అసిస్టెంట్: 9 పోస్టులు
5. ల్యాబ్ అటెండెంట్: 3 పోస్టులు
6. పోస్ట్ మార్టం అసిస్టెంట్: 5 పోస్టులు
7. రికార్డ్ అసిస్టెంట్: 1 పోస్టు
8. జనరల్ డ్యూటీ అటెండెంట్: 10 పోస్టులు
9. ఆఫీస్ సబార్డినేట్: 2 పోస్టులు

అర్హతలు: పోస్టును అనుసరించి పదో తరగతి, డీఎంఎల్‌టీ, డీఫార్మసీ, బీఫార్మసీ, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 42 ఏళ్లకు మించరాదు.

ఎంపిక: అకడమిక్ మార్కులు, పని అనుభవంతో.

దరఖాస్తులు: చిత్తూరులోని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో సమర్పించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 07-09-2023.

వెబ్‌సైట్: https://annamayya.ap.gov.in/

24 సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు

నల్గొండ జిల్లాలోని టీవీవీపీ ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఖాళీల వివరాలు:

1. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్: 21 పోస్టులు

స్పెషాలిటీలు: గైనకాలజీ, అనస్థీషియా, పీడియాట్రిక్స్, రేడియాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనరీ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ.

2. సివిల్ అసిస్టెంట్ సర్జన్ జీడీఎంవో: 03 పోస్టులు

అర్హతలు: ఎంబీబీఎస్, సంబంధిత స్పెషాలిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.09.2023.

వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేదీ: 08.09.2023.

వేదిక: సూపరింటెండెంట్ కార్యాలయం, జిల్లా కేంద్ర ఆసుపత్రి, నల్గొండ.

వెబ్‌సైట్: https://nalgonda.telangana.gov.in/

తాజా ఇంటర్నషిప్‌లు

విశాఖపట్నంలో

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: మ్యాట్రిక్ సర్వీసెస్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్ డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/f42fd5

అడ్మినిస్ట్రేషన్

సంస్థ: ఏఎంఎస్ మెరైన్ సర్వీసెస్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6
అర్హతలు: అడ్మినిస్ట్రేషన్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు ☛ internshala.com/i/ee629f

వర్క్ ఫ్రమ్ హోమ్

డైటెటిక్స్/న్యూట్రిషన్

సంస్థ: అక్సిమ్స్ వెల్‌నెస్ ఎల్ఎలీ
స్టైపెండ్: నెలకు రూ.7,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 15
అర్హతలు: డైటెటిక్స్/న్యూట్రిషన్ నైపుణ్యాలు
☛ internshala.com/i/b2180e

ఫైనాన్స్

సంస్థ: న్యూ ఇండియా ఎడ్యుకేటెడ్ ఇండియా
స్టైపెండ్: నెలకు రూ.5,500
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 15
అర్హతలు: అకౌంటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు ☛ internshala.com/i/d6ed99

మెషీన్ లెర్నింగ్ కంటెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: సీపోర్ట్ఏఐ **స్టైపెండ్:** నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 15
అర్హతలు: డీప్ లెర్నింగ్, మెషీన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పైథాన్ నైపుణ్యాలు ☛ internshala.com/i/971814

సేల్స్

సంస్థ: ప్యూమ్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 15
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
☛ internshala.com/i/94da55

కంటెంట్ రైటింగ్

సంస్థ: పాత్‌శాల స్పార్క్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 15
అర్హతలు: కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం
☛ internshala.com/i/60e090

తెలుగులో పీజీ.. తక్కువ ఫీజు

సార్వత్రిక విద్యకు.. అంబేడ్కర్ వర్సిటీ ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో దూరవిద్యకు దగ్గరి దారి.. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. అభ్యసన కేంద్రాలు అందుబాటులో ఉండటం, ఎక్కువ సంఖ్యలో కోర్సులు, తక్కువ ఫీజులు, తెలుగు మీడియంలోనూ పీజీ కోర్సులు అందించడం.. తదితర కారణాలతో ఈ సంస్థలో ఎక్కువ మంది విద్యార్థులు, ఔత్సాహికులు చేరుతున్నారు. యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను బీఆర్‌ఏఓయూ అందిస్తోంది. వాటిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఆ వివరాలు..

ఇవీ కోర్సులు

యూజీలో..

బీఏ, బీఎస్సీలను తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో ఈ విశ్వవిద్యాలయం అందిస్తోంది. బీకాం కోర్సు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. కోర్సుల వ్యవధి మూడేళ్లు. యూజీ కోర్సులకు ట్యూషన్ ఫీజు మొదటి ఏడాది రూ. 2700, తర్వాత రెండేళ్లు ఏడాదికి రూ.2500 చొప్పున చెల్లించాలి. అలాగే సైన్స్ కోర్సుల్లో చేరినవారు ల్యాబ్ ఫీజు అదనంగా చెల్లించాలి. యూజీ కోర్సులను ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్) విధానంలో నిర్వహిస్తున్నారు. ఏడాదికి రెండు సెమిస్టర్లు చొప్పున ఉంటాయి.

విభాగాలవారీ సబ్జెక్టుల వివరాలు...

కళలు (ఆర్ట్స్): తెలుగు సాహిత్యం, ఆంగ్ల సాహిత్యం, హిందీ సాహిత్యం, ఉర్దూ సాహిత్యం.

సోషల్ సైన్సెస్ (సామాజిక శాస్త్రాలు): అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతిశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం, ప్రభుత్వ పాలనశాస్త్రం, సమాజశాస్త్రం, జర్నలిజం.

విజ్ఞానశాస్త్రాలు (సైన్స్): వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, గణితశాస్త్రం, గణాంకశాస్త్రం, భూగర్భశాస్త్రం.

వాణిజ్యశాస్త్రం: కామర్స్.

అర్హత: యూజీ కోర్సులకు ఇంటర్ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, రెండేళ్ల ఒకేషనల్/ ఐటీఐ కోర్సులు చదివిన వారూ అర్హులే. ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తిచేసుకున్న వారికీ అవకాశం ఉంది.

పీజీలో..

ఎంఏ: ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఉర్దూ. వీటిలో ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ కోర్సులను తెలుగు మాధ్యమంలోనే అందిస్తున్నారు. స్టడీ మెటీరియల్ కూడా తెలుగులోనే ఉంటుంది. పరీక్షలు తెలుగు/ఇంగ్లిష్‌లో రాసుకోవచ్చు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ ఆంగ్ల మాధ్యమంలోనే లభిస్తుంది. లాంగ్వేజ్ కోర్సులు సంబంధిత భాషలో ఉంటాయి. కోర్సుల ఫీజు మొదటి ఏడాదికి రూ.5300. రెండో ఏడాదికి రూ.5000. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌కు మొదటి ఏడాది రూ.7800. రెండో సంవత్సరానికి రూ.7500. ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఏదైనా యూజీ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ: మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, సైకాలజీ. వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. కెమిస్ట్రీకి మొదటి సంవత్సరం రూ.18,300. రెండో ఏట రూ.18,000. మ్యాథ్స్‌కి రెండేళ్లూ వరుసగా రూ.7800, 7500. మిగిలినవాటికి మొదటి ఏడాదికి రూ.15,300. రెండో సంవత్సరానికి రూ.15,000 ఫీజు చెల్లించాలి.

అర్హత: సంబంధిత సబ్జెక్టులను బ్యాచిలర్ డిగ్రీలో చదివుండాలి. సైకాలజీకి ఏదైనా డిగ్రీ ఉంటే సరిపోతుంది. డిగ్రీలో సైన్స్ గ్రూపులవారు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులో చేరవచ్చు.

ఎంబీఏ: రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఏపీ లేదా తెలంగాణ ఐసెట్-2023లో అర్హత సాధించాలి. డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే 45 శాతం చాలు. కోర్సు ఫీజు మొదటి ఏడాదికి రూ.15,300. రెండో సంవత్సరానికి రూ.15,000.

ఎంఎల్ఐఎస్సీ: 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ట్యూషన్ ఫీజు రూ.10,300.

బీఎల్ఐఎస్సీ: గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే 45 శాతం. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.5300.

ఎంకాం: బీకాం, బీబీఏ, బీబీఎం, బీఏ (కామర్స్) వీటిలో ఏదైనా కోర్సు చదివినవారు చేరవచ్చు. ఫీజు మొదటి సంవత్సరం రూ.7800, రెండో ఏడాది రూ.7500.

డిప్లొమా: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, విమెన్ స్టడీస్, . ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది.

అర్హత: ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. సైకలాజికల్ కౌన్సెలింగ్‌కు మాత్రం డిగ్రీ లేదా పీజీలో సైకాలజీ చదివుండాలి.

సర్టిఫికెట్: ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్జీవోస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్. కోర్సుల వ్యవధి ఆరు నెలలు. కోర్సును బట్టి వీటిని పదోతరగతి, ఇంటర్, ఎలాంటి విద్యార్హతలు లేకుండా అందిస్తున్నారు.

అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబరు 5.

వెబ్‌సైట్: https://www.braouonline.in/

కాకతీయ వర్సిటీలో...

కాకతీయ విశ్వవిద్యాలయం (వరంగల్) యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

యూజీ

బీకాం(జనరల్/కంప్యూటర్స్), బీబీఏ, బీఎల్ఐఎస్సీ, బీఎస్సీ(మ్యాథ్స్/స్టాటిస్టిక్స్/కంప్యూటర్స్)

పీజీ

ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హెచ్ఆర్ఎం, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ.

ఎమ్మెస్సీ

బోటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ.

డిప్లొమా(ఏడాది)

బిజినెస్ మేనేజ్‌మెంట్, రిటైల్ మార్కెటింగ్, టాలీ, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో సర్టిఫికెట్ కోర్సు.

ఓరియెంటేషన్ (3 నెలలు)

మిమిక్రీ, ఓకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మ్యూజిక్, సాఫ్ట్ స్కిల్స్.

అపరాధ రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: http://www.sdlceku.co.in/

సివిల్స్ సన్నద్ధత...

బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఐఏఎస్ కావాలనుకుంటున్నాను. లక్ష్య సాధనకు ఇప్పటినుంచీ ఎలా సిద్ధం కావాలో చెప్పండి. – పి.శ్యామ్

■ ఐఏఎస్ అవ్వాలంటే యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపాలి. సివిల్స్ లాంటి పరీక్షకు.. డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే సన్నద్ధం అయితే ఫలితాలు బాగుంటాయి. ముందుగా యూపీఎస్సీ వెబ్‌సైట్‌ని సందర్శించి సివిల్ సర్వీసెస్‌కు సంబంధించిన సిలబస్, పాత ప్రశ్నపత్రాలను పరిశీలించి ఈ పరీక్షపై అవగాహన ఏర్పరుచుకోండి. సిలబస్ ఆధారంగా ప్రామాణిక పుస్తకాలను సమకూర్చుకోండి. క్రమం తప్పకుండా దినపత్రికల్ని చదవండి. సంపాదకీయ పేజీలో వచ్చే వ్యాసాలను తప్పకుండా చదవండి. ఇప్పటికే ఈ పరీక్షకు సన్నద్ధం అయ్యేవారి సలహాలూ, సూచనలను స్వీకరించండి. సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉన్న సివిల్స్ విజేతల ఇంటర్వ్యూలను చూస్తూ ప్రేరణ పొందండి. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విషయ విశ్లేషణా సామర్థ్యాలను కూడా పెంపొందించుకోండి. సీశాట్ పరీక్ష కోసం ఇప్పటినుంచే సన్నద్ధంకండి. మెయిన్స్ పరీక్షకు రాయబోయే ఆప్షనల్ సబ్జెక్ట్‌ను ముందే ఎంచుకోండి. రోజుకు ఎన్ని గంటలు చదవాలనుకుంటున్నారో.. అందుకు అనుగుణంగా షెడ్యూల్‌ని సిద్ధం చేసుకోండి. చదివిన విషయాల్ని వీలున్నప్పుడల్లా పునశ్చరణ చేస్తూ ఉండండి. వీలైనన్ని మాక్ టెస్ట్‌లు రాయండి. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలు నేరుగా దొరకవు. ప్రాథమిక అంశాలపై గట్టిపట్టు ఉండి, నిరంతరం చదివే అలవాటు ఉన్నవారు ఈ ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయగలరు. ముఖ్యంగా మెయిన్స్ పరీక్షలో రాయవలసిన దీర్ఘ వ్యాసాలపై అవగాహన పెంచుకుని, అవి రాయడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోండి. పైన చెప్పిన విషయాలన్నింటినీ పాటిస్తూ.. ఐఏఎస్ అవ్వాలన్న మీ కలను నిజం చేసుకోండి. – ప్రొ. వెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్